ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024
5
శ్రీ సత్యసాయి

పరిహారం కోసం ఎదురుచూపు

ఎన్నికల ప్రకటనలోపు సొమ్ము అందేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 ఖరీఫ్ పంటనష్టానికి సంబంధించి పరిహారం కోసం రైతులు ప్రభుత్వం వైపు ఎదురు చూస్తున్నారు. ఒకవైపు ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. మరి కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అది వచ్చాక పరిహారం ఏమవుతుందోనన్న గుబులు రైతుల్లో నెలకొంది. 2023 ఖరీఫ్‌లో జిల్లాలో తీవ్రమైన వర్షాభావం నెలకొంది. పంటసాగు కూడా 63 శాతం అయింది. 3.48 లక్షల హెక్టార్లు సాధారణ సాగయితే 2.18 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో 1.79 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందులో పంటనష్టం అంచనాలను అధికార యంత్రాంగం రూపొందించింది.

రూ.251 కోట్లు నష్టం

అనంతపురం జిల్లాలో 1.79 లక్షల హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. ఇవి కాకుండా మరో 25 వేల హెక్టార్లలో మిరప పంట కూడా దెబ్బతింది. మొత్తంగా రూ.251 కోట్లు నష్టపోయినట్టు అంచనా రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో 81707 హెక్టార్లలో వేరుశనగ పంట దెబ్బతింది. దీనికి రూ.138.9 కోట్లు పరిహారం ప్రతిపాదించారు. ఆముదం 22312 హెక్టార్లకుగానూ రూ.18.96 కోట్లు, కంది రూ.42.09 కోట్లు, పత్తి రూ.43.46 కోట్లు ఇలా మొత్తం కలిపి రూ.251.20 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం కూడా 2024 సంక్రాంతి నాటికి పరిహారం అందజేస్తామని ప్రకటించింది. కాని ఇప్పటికి వరకు అధికారిక ప్రకటనేది చేయలేదు.దీంతో ఎప్పటికి పరిహారం అందుతుందని రైతులు ఎదురు చూస్తున్నారు కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశాలుండటంతో ఆ తరువాత పరిహారం ఇచ్చే అవకాశం ఉండదు. ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం ఏ రకంగా ఉంటుందన్న సందేహాలూ ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తక్షణం పంటనష్ట పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈనెల ఏడున కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

రైతులకు పరిహారం అందజేయాలని కోరుతూ ఈనెల ఏడవ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్టు సిపిఎం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి నాటికే పరిహారం అందజేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కాని ఇంత వరకు పరిహారం రాలేదు. ఇప్పటికైనా ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల ఏడున జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్టు తెలిపారు. దీనికి రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో...

పైసా వసూల్

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- మితిమీరిన మామూళ్ల దందా..!
- పెత్తనం చెలాయిస్తున్న కిందిస్థాయి ఉద్యోగి
- అందరికీ మామూళ్లు పంచాలంటూ వ్యాఖ్యలు
- వెనుకేసుకొస్తున్న ఉన్నతాధికారి

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందన్న విమర్శలు పట్టణంలో బలంగా వినపడుతున్నాయి. కార్యాలయంలో అవినీతి అక్రమాలను అరికట్టే అధికారి గాని ప్రజాప్రతినిధి గాని కనిపించలేదని బాధితులు వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కనుసన్నల్లో కిందిస్థాయి ఉద్యోగి ద్వారా అవినీతి తారాస్థాయిలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరుగుతున్న అవినీతి బాగోతానికి సంబందించిన విడియోలు రెండు రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత జిల్లా అధికారులు గాని, ఉన్నతాధికారులు కాని స్పందించిన దాఖలాలు కన్పించలేదు. కార్యాలయంలో ఏం జరగాలన్నా తన ప్రమేయం ఉండాల్సిందేనని కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగి బాహాటంగా చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో తాను చెప్పిందే వేదం అని వేలాది రూపాయలు వసూలు చేస్తూ కార్యాలయ అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు పంచాల్సిన బాధ్యత కూడా తనదే అని కొంతమంది వద్ద నగదు తీసుకుంటున్న సమయంలో ఆ ఉద్యోగి చెప్పుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని బట్టి చూస్తే ఆ ఉద్యోగి వ్యాఖ్యలు నిజమైనట్లే కదా అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కార్యాయంలో జరిగిన లావాదేవీలను ఆడిట్ చేసేందుకు వచ్చిన అధికారులు తమ పరిశీలనలో కార్యాలయంలో ప్రభుత్వానికి కొంతవరకు నష్టం కలిగించిన విధంగా పనులు జరగాయని బయట పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై వారు హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు కేంద్ర బింధువు అయిన ఆ కిందిస్థాయి ఉద్యోగి కొంతమంది వద్ద నోరుజారి చేసిన వ్యాఖ్యలతో కూడిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్యాలయంలో వస్తున్న అక్రమ సంపాదన స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకే పంచడానికి సరిపోతుందని అయన అన్నట్లు ఉన్న విడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే ఈ తతంగం అంతా సంబంధిత జిల్లా అధికారులకు గానీ రాష్ట్రస్థాయి అధికారులకు గానీ తెలియకుండా ఉంటుందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అన్న ఆరోపణలు కూడా వినపడుతున్నాయి.కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచవతారం ఎత్తిన కొంతమది సిబ్బంది రిజిస్ట్రేషన్ల ఈసీ, ఆర్‌హెచ్ నకలు తదితర సేవల అవసరం కొరకు వచ్చిన వారి నుండి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము తోపాటు లంచం రూపంలో అదనంగా రెండింతలు,మూడింతల సొమ్మును వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈ లంచావతారాల వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముడుపులు ముట్టజెప్పిన వారికి నిర్ణీత సమయంలో అన్ని సేవలు అందుతాయని మిగిలిన వారు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగవలసి వస్తుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అవినీతి అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కదిరి ప్రజలు కోరుతున్నారు.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ వివరణ :సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలపై సబ్ రిజిస్టర్ అధికారి శిరీషకి ప్రజాశక్తి వివరణ కోరగా ఆమె అస్పష్టమైన సమాధానమిచ్చారు. మందుల కోసం ఇచ్చిన డబ్బులు తీసుకున్నారని అన్నారు. తమ కార్యాలయంలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు.

డీఎస్సీ నిరుద్యోగులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిఎస్సీలో తక్కువ పోస్టులు భర్తీ చేయడాన్ని నిరసిస్తూ డీఎస్సీ నిరుద్యోగులు చేపట్టిన ఆంధోళనల నేపథ్యంలో నమోదు చేసి అక్రమ కేసులను ఎత్తివేయాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనరసింహా, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ 6100 పోస్టుల్లో జిల్లా అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించినందుకు ప్రభుత్వం పోలీసులతో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే కేసులన్ని ఎత్తి వేయాలన్నారు. మరోసారి పరిశీలించి మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు కప్పల నరేష్, వీరనంద, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు పలువురు నూతన తహశీల్దార్లు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుండి శ్రీ సత్య సాయి జిల్లాకు పలువురు తహశీల్దార్లు బదిలీపై వచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరందరూ వారి వారి స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. వివిధ జిల్లాల నుండి బదిలీ అయిన అధికారులు వారి వారి ప్రాంతాల్లో సోమవారం విధులకు హాజరు కావాల్సి ఉంది.

ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్కే అమిత్‌బాషా గాండ్లపెంట	సికె. పల్లి తహశీల్దార్‌గా
వెంకటేశ్వర్లు, కర్నూలు కలెక్టరేట్ సూపరింటెండెంట్	మడకశిర తహశీల్దార్‌గా
ప్రతాపరెడ్డి కడప కలెక్టరేట్ నుంచి	గుడిబండ తహశీల్దార్‌గా
ఎస్ బద్రుజమ్మ కడప స్పెషల్ తహశీల్దార్	రొళ్ల తహశీల్దార్‌గా
వి వెంకటసుబ్బయ్య వైయస్సార్ జిల్లా నుంచి	అమరాపురం తహశీల్దార్‌గా
సిహెచ్ శివప్రసాద్ రెడ్డి, కర్నూలు జిల్లా ఓర్వకల్లు తహశీల్దార్	హిందూపురం తహశీల్దార్‌గా
భాగ్యలత ,అన్నమయ్య జిల్లా కలికిరి తహశీల్దార్	చిలమత్తూరు తహశీల్దార్‌గా
బాల నరసింహులు, వైయస్సార్ జిల్లా తొండూరు తహశీల్దార్	లేపాక్షి తహశీల్దార్‌గా
ఉదయ శంకర్ రాజు, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి తహశీల్దార్	పెనుగొండ తహశీల్దార్‌గా
వసుంధర, కర్నూలు కలెక్టర్ నుంచి	పరిగి తహశీల్దార్‌గా
ఎం.లక్ష్మీనారాయణ, వైయస్సార్ జిల్లా లింగాల తహశీల్దార్	రొద్దం తహశీల్దార్‌గా
అంజనాదేవి, నంద్యాల జిల్లా స్పెషల్ తహశీల్దార్	సోమందేపల్లి తహశీల్దార్‌గా
అక్బల్ బాషా, జమ్మలమడుగు ఆర్డీవో ఆఫీస్ నుండి	గోరంట్ల తహశీల్దార్‌గా
ఎ. వేణుగోపాల్, కర్నూలు జిల్లా గోనిగండ్ల తహశీల్దార్	పుట్టపర్తి తహశీల్దార్‌గా
కళావతి, చిత్తూరు జిల్లా పెనుమూరు తహశీల్దార్	కొత్తచెరువు తహశీల్దార్‌గా
పి. భారతి, వైఎస్ఆర్ జిల్లా కడప కలెక్టరేట్ నుంచి	సత్య సాయి జిల్లా కలెక్టరేట్‌కు
జి నాగభూషణం, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ నుంచి	నల్లమాడ తహశీల్దార్‌గా
ఖాజా, అన్నమయ్య జిల్లా గుర్రంకొండ తహశీల్దార్	ఓబుళదేవరచెరువు తహశీల్దార్‌గా
రమేష్, వైయస్సార్ జిల్లా ఒంటిమిట్ట తహశీల్దార్	ధర్మవరం తహశీల్దార్‌గా
నజ్మాభాను, కర్నూలు జిల్లా పత్తికొండ తహశీల్దార్	తాడిమర్రి తహశీల్దార్‌గా
సరస్వతి వైయస్సార్ జిల్లా కమలాపురం తహశీల్దార్	ముదిగుబ్బ తహశీల్దార్‌గా
జె. శివశంకర్ నాయక్, కర్నూలు జిల్లా గూడూరు తహశీల్దార్	బత్తలపల్లి తహశీల్దార్‌గా
వై రామనాథరెడ్డి సత్య సాయి జిల్లా ఓడి చెరువు తహశీల్దార్	కదిరి తహశీల్దార్‌గా
రామకుమారి, వైయస్సార్ జిల్లా దువ్వూరు తహశీల్దార్	తలుపుల తహశీల్దార్‌గా
డి శ్రావణి, , అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ నుంచి	సత్య సాయి జిల్లా కలెక్టరేట్‌కు
వి శ్రీనివాసులు, కర్నూలు కలెక్టరేట్ నుంచి	సత్యసాయిజిల్లా కలెక్టరేట్‌కు
ఎం వెంకటస్వామి, వైఎస్ఆర్ జిల్లా కడప ఆర్టీవో ఆఫీస్ నుంచి	పుట్టపరి ఆర్డీవో ఆఫీసుకు,
వి రామాంజనేయరెడ్డి, సత్య సాయి జిల్లా కొత్తచెరువు తహశీల్దార్	సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌కు
కె అన్వర్ హుస్సేన్, సత్యసాయి జిల్లా అమడగూరు తహశీల్దార్	సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌కు
బాబు, సత్యసాయి జిల్లా లేపాక్షి తహశీల్దార్	కదిరి ఆర్డీవో ఆఫీస్‌కు,
డి రమేష్ బాబు, సత్యసాయి జిల్లా అమరాపురం తహశీల్దార్	ధర్మవరం ఆర్డీవో ఆఫీస్‌కు

సేవాభావం అలవర్చుకోవాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

సినిమా హీరోలతో పాటు ఇతర అభిమానుల సంఘాల యువకులు ముందుకు వచ్చి విరివిగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. సినీనటులు కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలోని బాలింతల వార్డుకు వేడి నీళ్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ ప్రారంభించారు. అనంతరం కొంత మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు ప్రభాస్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ వెంకటేష్ రెడ్డి మాట్లాడుతు ప్రభుత్వ అసుపత్రిలోని బాలింతలు వేడి నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి సమస్యను పరిష్కరించడంలో భాగంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వేడి నీళ్ల ప్లాంట్‌ను అందించామన్నారు. హీరోల అభిమానులు బ్యానర్లు కడుతూ హంగామాలు చేయడమే కాకుండా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి హిందూపురంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మదన గోపాల్ రెడ్డి, యువ తేజ, ముస్తఫా, శ్రవణ్, రఘు, ఫారుక్, రవి, సాయి, నితిన్, మూర్తి, మధు, అభిమానులు పాల్గొన్నారు.

అసుపత్రిలో వేడి నీళ్ల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్

'పురం'రూరల్ సిఐగా ఈరన్న

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ సిఐగా ఈరన్న ఆదివారం బాద్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనకు గతంలో వన్‌టౌన్ సిఐగా ఇక్కడ విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. ఆ అనుభవంతో రూరల్ పరధిలోని మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొడికొండ జాతీయ రహదారిలో అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీకంపురంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర నాయకులు, కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డె ఓబన్న ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి సైన్యంలో సైన్యాధ్యక్షుడిగా ముందు ఉండి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుళ, సంఘం నాయకులు ప్రసాద్, నాగరాజు, అక్కులప్ప, వెంకటేష్, ఆశ్వర్థప్ప, హనుమప్ప, నారాయణస్వామి, దుర్గా నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్మికుల సంక్షేమానికి పలు ప్రభుత్వ పథకాలు

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సి.సూర్యనారాయణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి. సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన లేని పలువురు కార్మికులు కేవలం తమ రెక్కల కష్టం పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసంఘటిత కార్మికులకు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్మిక చట్టాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లేని కార్మికులు ఆ ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారు ప్రమాదవశాత్తు అంగవైకల్యంతో బాధపడేవారు కొందరైతే, మృతిచెందిన వారి కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్నారు. అలాంటి బాధితుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు వాటి అమలు తీరుపై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.సూర్యనారాయణ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : భవన నిర్మాణ, ఇతర పనులు చేసే కార్మికుల సంక్షేమం కోసం మీ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ఏమిటి.?

జవాబు : అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత, ప్రమాద బీమా, అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం, కార్మిక కుటుంబాలలోని ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కానుక తదితర ప్రయోజనాలు పొందవచ్చు. అయితే కార్మిక శాఖలో గుర్తింపు పొందిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రతి కార్మికుడు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది.

ప్ర : గుర్తింపు కార్డు పొందేందుకు ఏయేరంగంలోని కార్మికులు అర్హులు?

జ : వ్యవసాయ మరియు అనుబంధ ఉపాధుల్లో పనివారు, చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవన పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు వాటి అనుబంధ రంగాలలో పనిచేసేవారు, త్రవ్వకం, రాళ్ల కొట్టే పని, సెంట్రింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్స్, టైల్స్ పనిచేసేవారు, ఎలక్ట్రీషన్, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీలు, కాంక్రీట్ మిల్లర్, బావులు తవ్వడం, పూడిక తీయడం, టైలరింగ్‌లో పనిచేసేవారు. అలాగే ఆటోమొబైల్ రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు హెల్పర్లు, చేనేత, కమ్మరి స్వర్ణకారులు, కుమ్మరి, క్షౌరవత్తి, చర్మకారులు రజకులు, వీధి దీపాలు చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వ్యాపారాలు, కల్లుగీత కార్మికులు, పాచి పని చేసేవారు, ఎన్‌ఆర్‌ఈజీ వర్కర్లు మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆశాలు, వలస కార్మికులు వీరంతా గుర్తింపు కార్డులకు అర్హులు అవుతారు.

ప్ర : గుర్తింపు కార్డులు ఎక్కడ పొందాలో తెలపండి?

జ : 16 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు, ఆదాయపన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ మరియు స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు ఈ గుర్తింపు కార్డు పొందవచ్చు. ఈ కెవైసి కలిగిన ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఇవ్వవలసి ఉంటుంది. వీరు సమీప గ్రామ వార్డు సచివాలయాలు, కామన్ సర్వీసెస్ సెంటర్ లో నమోదు చేయించుకోవచ్చు. నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ప్ర : గుర్తింపు కార్డు పొందిన కార్మికులకు కలిగే ప్రయోజనాలు వివరించండి ?

జ : కార్మికుని ఇంటిలో ఇద్దరు కుమార్తెల వివాహానికి 20 వేలు చొప్పున మంజూరు, కార్మికుని భార్య లేదా కుమార్తెల ప్రసూతి ఖర్చులకోసం 20 వేలు సహాయం, కార్మికుడు లేదా కార్మికురాలు సాధారణ మరణం పొందితే రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ. 5 లక్షలు బీమా, అంగవైకల్యం చెందితే అంగవైకల్యం శాతం బట్టి బీమా సౌకర్యం ఉంటుంది. నైపుణ్యం పెంపొందించే శిక్షణలు కూడా ఇవ్వడం జరుగుతుంది. 15 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో రోజు స్టైయి ఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ప్రతిఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్ర : జిల్లాలో ఎక్కడెక్కడ మీ శాఖలు ఉన్నాయి? సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జ : జిల్లాలో ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురంలలో మా శాఖలు ఉన్నాయి. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సత్యసాయి జిల్లా కేంద్రంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయాల్సుంది. ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్ర : ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది కార్మికులు నమోదు కాబడ్డారు? కార్మికులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

జ: జిల్లాలో 36 వేల మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేశాం. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని, సహకారాన్ని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. గుర్తింపు కార్డు నమోదు ఉచితంగా చేసుకోవచ్చు. ఇంకా నమోదు చేయించుకోని కార్మికులు వెంటనే తమ పేరు నమోదు చేసుకుని పథకాలు పొందాలని కోరుతున్నాం.

ప్రజలతో మమేకమైన మంత్రి ఉషచరణ్

వైసిపిని మరోమారు ఆదరించండి

'ఆత్మీయ పలకరింపు'లో మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను చేరుస్తున్న వైసిపిని మరోమారు ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీచరణ్ కోరారు. ఆత్మీయ పలకరింపులో భాగంగా ఆదివారం ఆమె మండలంలోని బ్రహ్మ సముద్రం, మేకలపల్లి, మండ్లి, జూలుకుంట గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షాలు ప్రజలపై రుద్దుతున్న అబద్ధపు మాటలు నమ్మద్దని, మీకు, మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే నన్ను గెలిపించాలని గుండె ధైర్యంతో చెప్పే ఏకైక వ్యక్తి సిఎం జగన్ అన్నారు. భవిష్యత్తులో మనకు, మన పిల్లలకు మంచి జరగాలంటే మరోసారి జగన్‌ను సిఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణరెడ్డి, జడ్పీటీసీ డిసి అశోక్, సేవాదళ్ అధ్యక్షులు వేణు, కంబాలప్ప, సర్పంచులు గంగాదేవి నరసింహమూర్తి, పరంధామ, కిష్టప్ప, సోమశేఖర్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, అమర్నాథ్, విజయ్, సునీల్, డీలర్ మల్లికార్జున, కొల్లప్ప పాల్గొన్నారు.

సిఎం జగన్.. నోరు అదుపులో పెట్టుకో

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'చిలకం'

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సిఎం జగన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, మరో రెండు నెలల్లో పలాయనం చిత్తగించడానికి సిద్ధంగా ఉండాలని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారం ఉంది కదా అని సిఎం జగన్ స్థాయి మరచి నోటికి వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఉత్తర ప్రగల్భాలు కట్టిపెట్టి ప్రజలకు ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. 5 లక్షల మంది అర్హులు పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉంటే డీఎస్సీలో 6,100 పోస్టులకు నోటిఫికేషన్ వదలడం ఏంటని నిలదీశారు. ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఎక్కడన్నారు. జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. మీ పార్టీ నాయకులే సొంత చెల్లి షర్మిలపై వ్యక్తిగత దూషణలు చేస్తుంటే నోరు మెదపని దౌర్భాగ్యుడు జగన్ అన్నారు. వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని, రాయలసీమలో పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న 98 డీఎస్సీ ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేకి 98 డీఎస్సీ ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో పలువురు 98 డీఎస్సీ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

వాలీబాల్ విజేత జట్టుకు ఎమ్మెల్యే అభినందనలు

'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ఛాంపియన్‌షిప్ సాధించిన ఎనుములపల్లి జట్టు క్రీడాకారులను ఎమ్మెల్యే దుద్దుకుంట తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జిల్లా పేరు నిలబెట్టాలని వారికి సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి మార్చాలని ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర కోర్ కమిటీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో జిల్లా, తాలూకా, మండల కమిటీలను ఏర్పాటు చేశారు. కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని ప్రారంభించా లని సూచించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి గతంలో టిడిపి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నాలు చేసిందని, 2024లో టిడిపి అధికారం చేపట్టిన వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తుందన్నారు. హిందూపురం పార్లమెంటు టిడిపి అభ్యర్థిగా బంగారు కృష్ణమూర్తిని ప్రకటించాలని కదిరి తాలూకా నూతన వాల్మీకి సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కుర్లపల్లి మోహన్, జిల్లా నాయకులు ధనుంజయ, మేకల శివప్రసాద్, వీరనారప్ప, మల్లెం అశోక్, తాలూకా అధ్యక్షులు చిన్న నరసింహులు, ప్రహ్లాద, భాస్కర్, ఆంజనేయులు, శ్రీనివాసులు, చలపతి, శంకర, ఆది, శ్రీకాంత్, రామాంజులు పాల్గొన్నారు.

నేడు మడకశిరకు షర్మిల, డికె రాక

మడకశిర : ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కర్నాటక డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ సోమవారం మడకశిరలో పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారాన్ని మడకశిర నుండి ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత చోటుచేసుకుందని చెప్పవచ్చు. సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి, మాజీ ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతుండడంతో ఎన్నికల శంఖారావం మడకశిర నుంచి ప్రారంభమవు తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

గంపల రమణారెడ్డికి సన్మానం

గోరంట్ల రూరల్ : గోరంట్లలో నాయీ బ్రాహ్మణుల సంఘం కమిటీ హాల్ నిర్మాణం కోసం మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు కరావులపల్లి గంపల రమణారెడ్డి మండలంలోని జీనవాండ్లపల్లి వద్ద ఉన్న సొంత భూమిలో 5 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. దీంతో రమణారెడ్డిని ఆదివారం నాయీ బ్రాహ్మణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ జనరంజకమైన పాలన అందిస్తున్నారని, మరోమా రు వైసిపిని గెలిపిస్తే ఎపి పేదరికం లేని రాష్ట్రంగా మారుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మారుతీ నగర్‌లో ఆదివారం 33వ వార్డు కౌన్సిలర్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి కేశవరెడ్డి, 34వ వార్డు ఇన్‌ఛార్జి బాలం గోపాల్, 30వ వార్డు కౌన్సిలర్ బోయ రమాదేవి, 35వ వార్డు కౌన్సిలర్ చింతా మారుతి, 40వ వార్డు ఇన్‌ఛార్జి మట్టెద్దుల కేశవరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నుంచి 200 కుటుంబా లు వైసిపిలో చేరగా వారికి ఎమ్మెల్యే వైసిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో రూ. 3వేల కోట్లకు పైగా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామ న్నారు. 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా ఒక్కో చేనేత కుటుంబానికి రూ. 24 వేలు అందించామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రి నిర్మించామన్నారు. తాగునీరు పుష్కలంగా అందిస్తున్నామన్నారు. 26 వేల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో పేదల తరపున సిఎం జగన్ ఒంటరిగా పోటీ చేస్తుంటే ప్రతిపక్షాలు అనైతిక పొత్తులతో ఒక్కటై కుట్రలు చేస్తారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, చాంద్‌బాషా, చందమూరి నారాయణరెడ్డి, కాచర్ల అంజి, నాగరాజు, యర్రగుంట భాగ్యలక్ష్మి, దేవరకొండ రమేష్, మట్టెద్దుల కేశవరెడ్డి, గజ్జల శివ, గోరకాటి పురుషోత్తంరెడ్డి, బడన్నపల్లి నర్శింహులు, చిల్లా భాస్కర్‌రెడ్డి, తోపుదుర్తి వెంకటరాముడు, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, కడప రంగస్వామి, తీర్థాల వెంకటరమణ, బోయ రమాదేవి, బాలంగోపాల్, బాలం లక్ష్మిదేవి, జింకా కంబగిరి, పరంధామరెడ్డి, కత్తి పెద్దన్న, చెలిమి పెద్దన్న, కుమారస్వామి, చింతా యల్లయ్య, కేశగాళ్ల క్రిష్ణమ్మ, సుబాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

వైసిపికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది

జయహో బిసి సభలో పరిటాల సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

సిఎం జగన్ పాలనలో బిసిలు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.. వైసిపికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలో ఆదివారం బిసిలు టిడిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో జయహో బిసి సభ నిర్వహించారు. పరిటాల సునీత మాట్లాడుతూ బిసిలకు ఏ కష్టమొచ్చినా పరిటాల రవి ముందుంటూ బిసిల పక్షపాతిగా వ్యవహరించారన్నారు. బిసిల కు రుణాలు ఇచ్చినా, కుల వృత్తుల వారికి పనిముట్లు ఇచ్చినా టిడిపికే సాధ్యమైందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిసిలకు కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. రాప్తాడు నియోజక వర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుల వల్ల అనేకమంది బిసిలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులు ఎమ్మెల్యే సోదరులకు కొమ్ము కాసి అమాయకులను ఇబ్బంది పెట్టారన్నారు. వారు ఎక్కడికి వెళ్లినా తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే సోదరుల వల్లే పేరూరు డ్యాంకు నీరు రాకుండా పోయిందన్నారు. తాము రూ. 804 కోట్లు నిధులు మంజూరు చేయిస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. వీరి బెదిరింపు లతో జాకీ పరిశ్రమ వెళ్లిపోయిందన్నారు. బిసిల రక్షణ చట్టం తీసుకొస్తామని తెలిపారు. ఎన్నికల వరకూ ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని ఆ తర్వాత ప్రజలకు మంచి చేసే ప్రజా ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

జయహో బిసి సభలో ప్రసంగిస్తున్న పరిటాల సునీత

పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో పట్టణం లోని 27, 30, 34 వార్డులకు చెందిన వంద కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి పరిటాల శ్రీరామ్ పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కష్ట పడి పని చేశామని, అయినా సరైన గుర్తింపు, సముచిత గౌరవం దక్కలేద న్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు ఒక్కరే అన్నారు. చంద్రబాబు నాయకత్వం ఎపికి ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చంద్ర బాబు నాయకత్వాన్ని బలపరిచేలా, పార్టీ గెలుపునకు నిబద్ధతతో పని చేయాలన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానంతో పాటు గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగూర్ హుస్సేన్, తెలుగు మహిళ నాయకురాలు ముతుకూరు బీబీ పాల్గొన్నారు.

కదిరిలో కందికుంట సమక్షంలో పలువురు

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో టిడిపిలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. స్థానిక నిజాంవలి కాలనీకి చెందిన వంద కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, వాల్మీకి పాఠశాల అధినేత పవనకుమార్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. కందికుంట మాట్లాడుతూ సిఎం జగన్ అధికార అహంతో వ్యవస్థలను నాశనం చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపించడంతో జగన్‌కు హఠాత్తుగా ప్రజలు గుర్తుకొచ్చారన్నారు. జగన్ అరాచకాలకు నంద్యాలలో మైనార్టీ కుటుంబం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా చిత్రహింసలకు గురి చేసి చనిపోయేందుకు కారణమయ్యారన్నారు. టిడిపి ప్రభుత్వంలో విడుదలైన నిధులతో రోడ్లు వేసి వైసిపి ప్రభుత్వం ఘనత అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు వేసి ఆహ్వానించి, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

కదిరిలో సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

ఎస్ఐ సురేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

బుక్కపట్నం : బుక్కపట్నం నూతన ఎస్ఐగా సురేష్ బాబు ఆదివారం బాధ్యత లు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ నరసిం హుడు పట్నం స్టేషన్‌కు బదిలీ కాగా, కొత్తచెరువు స్టేషన్ నుంచి సురేష్‌బాబు బుక్కపట్నం వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు గొడవ లకు దూరంగా ప్రశాంత జీవనం సాగిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. నూతన ఎస్ఐకి పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

భవన నిర్మాణ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-ఓబుళదేవరచేరువు

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ ఆదివారం భవన నిర్మాణ రంగం కార్మికులు మోకాళ్లపై నిల్చొని, చేతులతో కళ్లు మూసుకొని నిరసన తెలిపారు. సమస్య లు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ముందు భవన నిర్మాణ రంగం కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటితో 6వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీరాములు, కిష్టప్ప, కేశవ, రమణ, సూరి, రవి, శ్రీనివాసులు మహేష్, సురేంద్ర, చాంద్‌బాషా, కేశవ, అంజనప్ప, నాగరాజు, వెంకటేష్, సూర్యనారాయణ, అల్లాబక్షు, అలీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్ష

ధర్మవరం టౌన్ : పట్టణంలోని వాసవీ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస్ పరీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమా నికి ముఖ్య అతిథులు గా వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి, విజయలక్ష్మి హాస్పిటల్ డాక్టర్ మదన్‌మోహన్, కళాశాల కరస్పాండెంట్ ఈశ్వరయ్య, ఎఐఎల్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్ హాజరై విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. పరీక్షల పట్ల విద్యార్థులకు భయం పోవడానికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, దామోదర్, ఎస్పీఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు సాకే హరికుమార్, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస్ మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న సిఐ సుబ్రహ్మణ్యం, తదితరులు

తహశీల్దార్‌కు సన్మానం

రొద్దం : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీపై వెళ్తున్న తహశీల్దార్ అనంతాచారిని ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఆర్‌ఒల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విఆర్‌ఒలు తహశీల్దార్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రేషన్ డీలర్లు, ఎండియు వాహనాల సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

తహశీల్దార్ అనంతాచారిని సన్మానిస్తున్న విఆర్‌ఒలు

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం : సిఐ

ధర్మవరం టౌన్ : పట్టణంలో అసాంఘిక శక్తుల పై ఉక్కు పాదం మోపుతున్నా మని వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణ సరిహద్దులోని పుట్టపర్తి రోడ్డులో ఆదివారం సిఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. సిఐ మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా వుంచి ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు చేపడుతామన్నారు. అలాగే వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాల న్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. సిఐతో పాటు ఎస్ఐ మహమ్మద్‌రఫీ, సిబ్బంది ఉన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ సుబ్రహ్మణ్యం

వైసిపి సమన్వయకర్త సుడిగాలి పర్యటన

అమరాపురం : మండలంలో ఆదివారం మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప సుడిగాలి పర్యటన చేశారు. ఆయన జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, సర్పంచి ఆలదపల్లి ఈరన్న, ఎంపిపి ఈరన్న, నాయకులు శివరం పేలుబండ ప్రసాద్, మంజునాథ్‌రెడ్డి ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. అమరాపురంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై దళిత నాయకులు నారాయణప్ప, శివకుమార్, శివన్న, ముద్ద రాజు తదితరులతో ముచ్చటించారు. కార్యక్రమంలో గుడిబండ జడ్పిటిసి భూతరాజు, పలారం నవీన్‌కుమార్, రాజప్ప, బసవరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం 'హనుమాన్' చిత్ర ప్రదర్శన

కదిరి టౌన్ : మానసధార ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎంఎస్ ప్రశాంత్, హరీష్ పాఠశాల ప్రిన్సిపల్ ఎంఎస్ కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం కదిరి రాధికా పిక్చర్‌లో 300 మంది విద్యార్థులకు ఉచితంగా హనుమాన్ చిత్రాన్ని చూపించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి మంచి చిత్రాలు చూపించడం ద్వారా అవగాహన తెచ్చుకొని దైవ మార్గంలో నడుస్తారన్నారు. సమాజంలో జరిగే ప్రతి విషయంపై విద్యార్థులు అవగాహన పెంచుకొని, దైవాన్ని నమ్మి మంచి సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పేస్ కళాశాల అధ్యాపకులు, హరీష్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ చిత్రాన్ని చూసేందుకు థియేటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

ధర్మవరంలో వ్యక్తి దారుణహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బొగ్గు ప్రతాప్(ఫైల్‌ఫొటో)

పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఆదివారం ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. టూ టౌన్ సిఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఇందిరమ్మకాలనీకి చెందిన బొగ్గు ప్రతాప్(35) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. బొగ్గు ప్రతాప్, కేతిరెడ్డి కాలనీకి చెందిన స్నేహలత ఇంటర్ చదివే సమయంలో ప్రేమించుకోగా ఇరు కుటుంబాలు వారి ప్రేమను తిరస్కరించారు. ఆ తర్వాత బొగ్గు ప్రతాప్, స్నేహలత ఎవరికి వారు వేరే వ్యక్తులతో వివాహం చేసుకున్నారు. కొంతకాలం క్రితం ప్రతాప్ భార్య మృతి చెందగా మళ్లీ కేతిరెడ్డికాలనీలో ఉన్న స్నేహలతతో చనువుగా ఉంటూ ఆమె ఇంటికి వెళ్లేవాడు. ఇది గమనించిన స్నేహలత కుటుంబసభ్యులు మందలించారు. ఈ క్రమంలో ఆదివారం బొగ్గు ప్రతాప్ అతిగా మద్యం తాగి భర్తలేని సమయంలో స్నేహలత ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించగా ఆమె ఇంట్లో ఉన్న రోకలిబండతో తలపై బాది అక్కడి నుంచి పరారైంది. బొగ్గు ప్రతాప్ తీవ్ర రక్త స్రావంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రక్తపు మడుగులో ఉన్న బొగ్గు ప్రతాప్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి ఓ కుమార్తె ఉంది. స్నేహలతను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుబ ఆనంద్(28) మృతి చెందాడు. మండలంలోని చెరుకూరు గ్రామ సమీపంలో టింబక్టివ్ కార్యాలయం వద్ద కురుబ ఆనంద్ పొలంలో నుంచి రోడ్డు పైకి వస్తుండగా పెనుకొండ వైపు నుంచి మడకశిర వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ వలిబాషా సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల రూరల్ : మండలంలోని మలసముద్రం గ్రామానికి చెందిన వివాహిత అశ్వర్థమ్మ(50) ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాల కారణంగా ఆమె పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని ఎల్లోటి గ్రామంలో ఆదివారం టిడిపి సీనియర్ నాయకుడు నారాయణస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

మడకశిర : రొళ్ల మండలం హెచ్‌టి హళ్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రాజన్న అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్ ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. ఆయనతో పాటు జయమ్మ చిక్కన్న, రాజన్న, సన్న మారేగౌడ్, ఎస్.శ్రీరంగప్ప, ఎస్.తిమ్మప్ప, బండి రంగనాథ్, బండి కృష్ణమూర్తి, బండి రంగనాథ్, బండి గోవిందప్ప, బండి రమేష్, పొగాకు శ్రీనివాస్, మాహబాషా, హుసేన్‌సాబ్, ఎన్.కాంతరాజ్, రాష్ట్ర డైరెక్టర్ నారాయణప్ప, మంజునాథ్, రవికుమార్, రామన్న, రామప్ప, కాంతప్ప నివాళులర్పించారు.

నారాయణస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

శతాధిక వృద్ధురాలు ఈడిగ అంజనమ్మతో కుటుంబ సభ్యులు

శతాధిక వృద్ధురాలికి సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన కందూరు ఓబన్న మేనకోడలు, ఈడిగ అంజనప్ప భార్య ఈడిగ కమలమ్మ 102 ఏళ్లు పూర్తి చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆర్.మరవపల్లి గ్రామంలోని తోటలో ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆమె కుమారులు జనార్ధన, రంగస్వామి, శ్రీనివాసులు మాట్లాడుతూ మా అమ్మ తండ్రికి 8మంది కుమార్తెలు, 4కుమారులు సంతానం. కమలమ్మ మూడో కుమార్తె. ఈమె భర్త మృతి చెంది 28 ఏళ్లయిందన్నారు. కార్యక్రమంలో కమలమ్మ కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయకలయిక

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'మానవసేవే మాధవసేవ' తోటి మనిషికి సహాయ సహకారాలు అందిస్తే భగవంతునికి సేవ చేసినట్లేనని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల ఆవరణలో ఆదివారం 1981-82లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మిత్రుల్లో ఎవరైనా ఎలాంటి ఇబ్బందులకు లోనైనా ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చదువు నేర్పిన గురువులను సత్కరిం చారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా